క్లుప్తంగా

నేడు ఎంపీటీసీలు, సర్పంచులతో సమావేశం

మహేశ్వరం: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ తయారీపై గురువారం ఎంపీటీసీ, సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నర్సింహ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నేషనల్ పంచాయతీ అవార్డుల నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: మండల పరిధిలోని చీపునుంతలకు చెందిన జీనుకుంట్ల చెన్నయ్య నూతన ఇంటి నిర్మాణం చేపట్టాడు. డబ్బులు లేక ఇంటి నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేశాడు. సర్పంచ్ రఘుపతి సహకారంతో ఉప్పల ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ వెంకటేశ్‌ను కలిసి ఆర్థికసహాయం చేయాలని చెన్నయ్య కోరారు. బుధవారం ట్రస్టు సభ్యులచే ఇసుక, సిమెంట్, ఇటుక, స్టీల్ తదితర మెటీరియల్‌ను చెన్నయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రఘుపతి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సమావేశం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఆలేటి నారాయణసాగర్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 23న కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణ, బీఆర్‌ఎస్ పథకాల ప్రచారం కల్పించడానికి కార్యాచరణ రూపొందించేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. సమావేశానికి కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యే కోరారు.

రేపు ఎన్‌పీఏ అవార్డు గ్రహీతలకు సన్మానం

తలకొండపల్లి: నేషనల్ పంచాయతీ అవార్డ్స్‌లో (ఎన్‌పీఏ) భాగంగా 9 అంశాల్లో మొదటి 3 స్థానాల్లో నిలిచిన గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులకు శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తలకొండపల్లి, గౌరిపల్లి, వెంకట్రావ్‌పేట్, చీపునుంతల, చంద్రధన, గట్టుఇప్పలపల్లి, వెల్జాల్, లింగరావుపల్లి, పూల్‌సింగ్‌తండా, గడ్డమీదితండా, ఖానాపూర్, చౌదర్‌పల్లి, వీరన్నపల్లి, చుక్కాపూర్, బల్సులపల్లితండా, జంగారెడ్డిపల్లి, మెదక్‌పల్లి, అంతారం, పాతకోటతండా, దేవునిపడకల్, వెంకటాపూర్ గ్రామ పంచాయతీలు మొదటి 3 అంశాల్లో బెస్టు పంచాయతీలుగా నిలిచాయని ఈ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు సన్మానం చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయగలరని కోరారు.


కందుకూరులో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకుడు


హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ఆలయంలో పంచాంగ శ్రవణం


తుక్కుగూడ: రావిర్యాలలో పంచాంగం చదువుతున్న పూజారి

కొత్త ఆశల ఉగాది

మహేశ్వరం: మండలంలో ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం ఆలయాల్లో పంచాంగ శ్రవణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ప్రజలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కొత్త మట్టి కుండల్లో ఉగాది పచ్చడి తయారు చేసి అందరికి పంచిపెట్టారు. ఒకరికొకరు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వర స్వామి ఆలయం, హనుమాన్ ఆలయం, అమీర్‌పేట్ హనుమాన్, మన్సాన్‌పల్లి, గొల్లూరు, నాగిరెడ్డిపల్లి, నాగారం హనుమాన్ ఆలయం, పెండ్యాల, కోళ్లపడకల్, సుభాన్‌పూర్, దుబ్బచర్ల, ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి, హర్షగూడ, దిల్‌వార్‌గూడ, పెద్దమ్మ తండా, రామచంద్రగూడ, పడమటి తండా, ఉప్పుగడ్డ తండా, నందుపల్లి హనుమాన్ ఆలయంలో పంచాగ శ్రవణం, పూజలు చేశారు. కార్యక్రమంలో మహేశ్వరం ఎంపీపీ కే రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునిత, పీఏసీఎస్ చైర్మన్ ఎం పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ ఎస్ సుధీర్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కందుకూరు మండలంలో..

కందుకూరు: ఉగాది పండుగను బుధవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల వద్ద సందడి నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. షడ్రుచులతో చేసిన ఉగాది పచ్చడిని ఆరగించి సంతోషంగా గడిపారు. ఆలయాల వద్ద బ్రాహ్మణులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

పంచాంగ శ్రవణం

బడంగ్‌పేట్: ఉగాది పండుగను బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 32 డివిజన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇళ్ల గుమ్మాలకు పూలు, మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టారు. షడ్రుచులతో తయారు చేసిన పచ్చడిని సేవించి తెలుగు కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. బచ్చాలు, బొబ్బట్లు, పోలెలు తదితర పిండి వంటలతో ఇళ్లన్నీ ఘుమఘుమలాడాయి. సాయంత్రం బడంగ్‌పేట కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు చుట్టు పక్కల ఆలయాలు, గ్రామాల ప్రధాన కూడళ్ల వద్ద వేదపండితులు పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. గ్రామ పెద్దలు, నాయకులు, కాలనీ వాసులు, ప్రజాప్రతినిధులు పాల్గొని పంచాంగాన్ని శ్రద్ధగా విన్నారు. తమ పేరు బలాలు గురించి చెప్పించుకున్నారు. ఈ ఏడాది ఆదాయం, లాభం, నష్టం గురించి తెలుసుకుని దేవుని ఆశీర్వాదం తీసుకున్నారు.


అమీర్‌పేట్ హనుమాన్ ఆలయంలో పంచాంగ శ్రవణం

బాలాజీ ఆలయంలో..

పహాడీషరీఫ్: మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణం వినిపించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బండారి గోపాల్ యాదవ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆలయ పూజారి సుధీర్ కుమార్ పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ సందర్భంగా భక్తులు రాశుల వారీగా తమ పేరు బలాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా ఉగాది వేడుకలు

తుక్కుగూడ: తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను మున్సిపల్ పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తుక్కుగూడ, రావిర్యాల, మంఖాల్, దేవేందర్‌నగర్ కాలనీలో పండుగను ఘనంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో రద్దీగా కనిపించాయి. ప్రధాన కూడళ్ల వద్ద పురోహితులు పంచాగ శ్రవణం చేశారు.

జిల్లెలగూడ వెంకన్న ఆలయంలో..

మీర్‌పేట: పట్టణంలోని జిల్లెలగూడ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం సాయంత్రం ఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బీ రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు యాదగిరి ముదిరాజ్, మాదరి రమేష్, ఆలయ అర్చకులు డీ రామాచారి, సిబ్బంది అశోక్, భక్తులు పాల్గొన్నారు.


మహేశ్వరంలోని హనుమాన్ ఆలయంలో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న పూజారి


మీర్‌పేట: జిల్లెలగూడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

26న లయన్స్‌క్లబ్ సమావేశం

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ 320–ఎ కన్వెన్షన్ సమావేశం ఈనెల 26న సికింద్రాబాద్‌లోని క్లాసిక్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆమనగల్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జూలురి రఘు ఆధ్వర్యంలో నిర్వహించే డిస్ట్రిక్ట్ కన్వెన్షన్ సమావేశానికి ముఖ్య అతిథులుగా లయన్స్‌క్లబ్ పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వీరేంద్రకుమార్ లుత్రా, కౌన్సిల్ సెక్రటరీ రాధాకృష్ణ, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హర్యాన్ బట్టాడ్, కోటేశ్వర్‌రావ్, సూరత్‌సింగ్ మల్హోత్ర తదితరులు పాల్గొంటారని ఆయన వివరించారు. కన్వెన్షన్ సమావేశానికి లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ 320–ఎ పరిధిలోని 86 లయన్స్‌క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, రీజియన్, జోన్, జిల్లా చైర్మన్‌లు హాజరుకావాలని పాషా కోరారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని కోరింతకుంట తండాకు చెందిన మూడావత్తు మల్లేష్ యొక్క ఆవు ఇటీవల కుక్కల దాడిలో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి మల్లేశ్‌ను పరామర్శించారు. బుధవారం ఫౌండేషన్ సభ్యులచే తక్షణ సహాయంగా రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్, సర్పంచ్‌లు అనురాధ, నరేందర్‌గౌడ్, రవి, ఉప సర్పంచ్ రాము, రైతులు నర్సింహ, రాములు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం సీతారాంనగర్ తండా గ్రామ పరిధిలోని పులుగోనిపల్లి తండాకు చెందిన బాణావత్ గోపి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పులుగోనిపల్లి తండాలో బుధవారం గోపి కుటుంబ సభ్యులను మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నిట్టి నారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, నాయకులు కళ్యాణ్ నాయక్, జంగయ్య, రైసల్‌నాయక్ పాల్గొన్నారు.

సల్లంగ చూడు మైసమ్మ తల్లీ

కడ్తాల్: మైసిగండిలో కొలువైయున్న మైసమ్మ తల్లి దేవతకు ఉగాది పండుగను పురస్కరించుకుని, మాధారం శ్రీరాములుగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం నిర్వహించారు. వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తులసీరాం, లక్ష్మీనర్సింహారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, ఉపసర్పంచ్ రామకృష్ణ, ఎం శ్రీరాములుగౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, యాదగిరిగౌడ్, గణేశ్, విజయ్, వెంకటేశ్, శివగౌడ్, అఖిల్, నిఖిల్, వెంకటేశ్, రామకృష్ణ, రామస్వామి, రాజేశ్, రాందాస్, సాయికాంత్, కల్యాణ్, అశోక్ ఆలయ ఈఓ స్నేహలత, ట్రస్టీ శిరోలి పాల్గొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ మాదిగ

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ నెల 31న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలను బుధవారం మున్సిపాలిటీలోని సోలీపూర్ గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలరాజ్ మాదిగ మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఎస్సీ వర్గీకరణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. అలాగే, మహిళా బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని, నూతన పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరంగా ఎస్సీ ఉపకులాలను వర్గీకరించి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన అన్నారు. వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా పట్టించుకోకపోవడం సరికాదని వాపోయారు. డిమాండ్ల సాధనకు చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జంగయ్య, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, శ్రీనివాస్, ఆయూబ్, గంగారం, భీంరాజ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) మెరుగైన వైద్య సేవలు అందించే విషయంలో పేదలకు ఎంతగానో ఉపకరిస్తుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌కాలనీలో నివసించే మేరీ గ్రేసీ నరాల సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతోంది. ఆర్థిక పరిస్థితి సరిగా లేనందున ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో వెంటనే ఆయన ఆపరేషన్‌కు అవసరమయ్యే ఖర్చుల వివరాలతో సీఎం సహానిధికి దరఖాస్తు చేశారు. ఆపరేషన్‌కు సంబంధించిన ఎల్‌ఓసీ కింది రూ. 2.50 లక్షల చెక్కును మంజూరు చేశారు. ఆచెక్కును బాధిత మహిళ మేరీగ్రేసీకి బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలోఅందజేశారు. నాయకులు రాజిరెడ్డి, శ్రీధర్‌గౌడ్, మేరీ జాకబ్, దయానంద్, భాస్కర్, సాగర్ పాల్గొన్నారు.

చరిత్ర ఘనం.. సౌకర్యాలు శూన్యం

- ఏటా పెరుగుతున్న మాల్ సంత ఆదాయం
- శాశ్వత స్థలం లేక ప్రైవేట్ వెంచర్లలో పశువుల క్రయ విక్రయాలు
- తాగునీరు, మరుగుదొడ్లు లేక వ్యాపారుల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

యాచారం: మాల్ పశువుల సంత ఆదాయం ప్రతి ఏటా గణనీయంగా పెరుగుతున్నప్పటికీ సంతలో వసతుల కల్పనపై ప్రభుత్వం చొరవచూపడంలేదు. వేలంపాట మీద ఉండే ఆసక్తి.. సంతలో వసతులు కల్పించడంలో లేకపోవడంపై సంతకు వచ్చేవారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి–నల్లగొండ జిల్లాల సరిహద్దులోని యాచారం మండల పరిధి మాల్ గ్రామంలో ప్రతి మంగళవారం పశువుల సంత జరుగుతుంది. ఈ సంతలో పశువుల క్రయ, విక్రయాల కోసం రంగారెడ్డి జిల్లాలోని యాచారం, మంచాల, మాడ్గుల్, కడ్తాల్, ఆమనగల్లు, నల్లగొండ జిల్లాలోని చింతపల్లి, దేవరకొండ, మర్రిగూడ, నాంపెల్లి తదితర మండలాల నుంచి రైతులు, వ్యాపారులు వస్తారు. మాల్ గ్రామంలో 70 ఏళ్లుగా జరిగే ఈ పశువుల సంతకు రెండు జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో పేరుంది. ఈ సంత నిర్వహణకు గత 50 ఏళ్లుగా వేలంపాట నిర్వహిస్తున్నారు. సంతను మెయింటెన్ చేసేందుకు మొదటి ఏడాది రూ.500 నుంచి ప్రారంభమైన వేలంపాట ప్రతి ఏటా పెరుగుతూ వచ్చి ఈ ఏడాది దాదాపు రూ.71 లక్షలు పలికింది. పశువుల సంత వేలంపాట ద్వారా వచ్చే ఆదాయాన్ని మాల్ గ్రామ పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తారు. వ్యాపార పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న మాల్ గ్రామం పశువుల సంత ద్వారా వచ్చే ఆదాయంతో గణనీయమైన అభివృద్ధి చెందుతోంది. ఈ సంతలో పాడి పశువులతో పాటు ఎద్దులు, కోడెలు, మేకలు, గొర్రెలు, వ్యవసాయ పనిముట్లు తదితర వ్యవసాయ రంగానికి సంబంధించిన సామగ్రితో పాటు తాజా కూరగాయలు కూడా విక్రయిస్తారు.

శాశ్వత స్థలం కరువు..

మాల్ పశువుల సంతకు రెండు జిల్లాల్లో ఎంతో పేరున్నప్పటికీ నిర్వాహణకు శాశ్వత స్థలం మాత్రం కరువైంది. 40 ఏళ్ల కింద పశువుల సంత నిర్వహణ కోసం ఎకరా స్థలాన్ని కొనుగోలు చేశారు. ప్రతి ఏటా పశువుల క్రయ, విక్రయాలు పెరిగిపోతుండటంతో ఎకరా స్థలం సరిపోవడంలేదు. దీంతో ప్రతి మంగళవారం పశువుల సంతను ప్రైవేట్ వెంచర్లల్లో, ఇళ్ల మధ్యన నిర్వహిస్తున్నారు. కొన్నిసార్లు వెంచర్ల, ప్లాట్ల యజమానులు సంత జరగడాన్ని అడ్డుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. కొన్నిసార్లు సంత నిలిచిపోయే పరిస్థితి వచ్చింది. ఎకరా శాశ్వత స్థలం ఇరుకుగా ఉండటం, విశాలమైన స్థలం కేటాయించకపోవడంతో వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాల్ సంతకు ఎంతో పేరున్నా నిర్వహణకు సరిపడా స్థలం లేకపోవడం శాపంగా మారింది. సంత జరిగే సమీపంలోనే సర్వే నంబరు640లో 16 ఎకరాలకు పైగా ప్రభుత్వభూమి ఉంది. అందులో 5 ఎకరాల స్థలం కేటాయించాలని ప్రజాప్రతినిధులు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వ పెద్దలు, అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు.

సౌకర్యాలు నిల్..

పశువుల సంతకు శాశ్వత స్థలం లేకపోవడంతో పాటు సౌకర్యాల లేమితో పశువుల క్రయ, విక్రయాలకు వచ్చే వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంతకు వచ్చే పశువులు ఎండకు, వర్షానికి ఉండాల్సిందే. పంచాయతీ నుంచి కొన్ని టెంట్లు వేస్తున్నా పూర్తి స్థాయిలో సరిపోవడం లేదు. తాగునీటి సౌకర్యం ఉండదు. ప్రతి ఏటా రూ.లక్షల్లో ఆదాయం పెరుగుతున్నా వ్యాపారులకు, రైతులకు సౌకర్యాలు కల్పించే విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపడంలేదనే విమర్శలు ఉన్నాయి. పశువుల సంతకు సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన పశువులను తీసుకొచ్చే వ్యాపారులు, రైతులు సంతకు వచ్చిన తర్వాత కొద్దిసేపు సేద తీరుదామన్నా సౌకర్యాలు లేని పరిస్థితి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే మాల్‌లో జరిగే పశువుల సంతకు గణనీయమైన ఆదాయం వస్తుంది. సంతకు శాశ్వత స్థలం కేటాయించి, అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తే మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉందని ఆదిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని వ్యాపారులు కోరుతున్నారు.


ప్రైవేట్ వెంచర్లలో పశువుల క్రయ, విక్రయాలు

మాల్ పశువుల సంత ద్వారా జీపీకి వస్తున్న ఆదాయం (గత ఐదేళ్లుగా)

ఏడాది	రూ. లక్షల్లో
2019-20	రూ. 41 లక్షలు
2020-21	రూ. 52 లక్షలు
2021-22	రూ. 53 లక్షలు
2022-23	రూ. 63 లక్షలు
2023-24	రూ. 71 లక్షలు

తాగునీరు లేదు



పశువుల సంతకు కొన్నేళ్లుగా వస్తున్నాను. వందలాది పశువుల క్రయ, విక్రయాలు జరుపుతున్నప్పటికీ సరైన సౌకర్యాలు లేవు. సంతలో ఎండకు ఉండాల్సిందే. వర్షం కురిస్తే తడవాల్సిందే. తాగునీరు కూడా ఉండదు. పశువులను ఎండలోనే ఉంచి విక్రయించాలి. కాలినడకతో వచ్చి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఎండకు ఉండే పశువులు నీరసించిపోతున్నాయి.

– యాదయ్య, వ్యాపారి, నాంపెల్లి, నల్లగొండ

ఐదెకరాల స్థలం కేటాయించాలి



మాల్‌లో ప్రతి మంగళవారం నిర్వహించే పశువుల సంత కోసం సర్వే నంబరు 640లోని 16 ఎకరాల ప్రభుత్వ భూమిలో నుంచి 5 ఎకరాల స్థలం కేటాయించాలని గత కొన్నేళ్లుగా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేదు. ప్రస్తుతం ప్రైవేట్ వెంచర్లు, ప్లాట్లలోనే సంత నిర్వహణ చేపడుతున్నాం. సంతకు వచ్చే వ్యాపారులకు, రైతులకు పంచాయతీ నిధుల నుంచే సౌకర్యాలు కల్పిస్తున్నాం. పశువుల సంతకు స్థలం కేటాయిస్తే సమస్యలు తొలగిపోతాయి.

– పడకంటి కవిత, సర్పంచ్, మాల్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



మాల్ పశువుల సంత నిర్వహించే చోట స్థలం లేక పశువుల క్రయ, విక్రయాల్లో ఇబ్బందులు పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. సంతకు శాశ్వత స్థలం ఉంటే పంచాయతీ నిధుల ద్వారా షెడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించే అవకాశం ఉంటుంది. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓతో మాట్లాడి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తాను.

– ఉమారాణి, మండల పంచాయతీ అధికారి, యాచారం

తండాల అభివృద్ధికి చేయూతనిస్తాం

ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వెంకటేశ్

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గిరిజన తండాల అభివృద్ధికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు అండగా ఉంటుందని తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యులు, ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ తెలిపారు. ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పెంటతండాలోని తుల్జాభవానీ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో ఉప్పల వెంకటేశ్ పాల్గొన్నారు. అనంతరం తండాలో నలుగురు నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేశ్‌ను తాండావాసులు ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఉప్పల వెంకటేశ్ మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గంలో గత కొన్ని సంవత్సరాలుగా ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. మారుమూల గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వసతులు సమకూర్చినట్లు ఆయన వివరించారు. ఇళ్లులేని నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి సాయం అందించామని ఆయన చెప్పారు. పెంటతండాలో వీధి దీపాల ఏర్పాటుకు ఉప్పల ట్రస్టు సహాయం అందిస్తుందని ఉప్పల వెంకటేశ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోపాల్‌నాయక్, ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్ కృష్ణనాయక్, స్థానిక నాయకులు శంకర్, త్రిమూర్తులు, పర్వతాలు, వెంకట్‌రెడ్డి, కాంస్యనాయక్, మల్లేశ్, కృష్ణ, రాజు, కిశోర్, బాలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను ఆ పార్టీ స్థానిక నాయకులు బుధవారం నగరంలో కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. సంజయ్‌ను కలసిన వారిలో నాయకులు ఏ సత్తయ్య, బీ మల్లేష్, ఈ రవీందర్‌గౌడ్, ఏ ఆంజనేయులు, డీ బాల్‌రెడ్డి ఉన్నారు. – కందుకూరు